క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య



ఎల్కతుర్తి: మద్యానికి బానిసై అనారోగ్యం బారిన పడిన వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై జక్కుల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం. మండల కేంద్రానికి చెందిన కొమ్మిడి సంపత్‌రెడ్డి (58) సంవత్సరం కాలంగా మద్యానికి బానిసై అనారోగ్యం బారిన పడ్డాడు. ఈ క్రమంలో ఆరోగ్యం సహకరించడం లేదని మనస్తాపం చెందిన సంపత్‌రెడ్డి గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య కిరాణం షాపుకు వెళ్లి ఇంటికి వచ్చి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. మృతుని కుమారుడు శ్రావణ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఇద్దరిపై కేసు నమోదు

దామెర: ఆర్టీసీ బస్సు, కండక్టర్‌పై దాడిచేసిన ఘటనలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు అయ్యింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా దామెర పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన కథనం ప్రకారం. పరకాల ఆర్టీసీ డిపోకు చెందిన ఏపీ29 జెడ్ 2135 నంబర్ గల ఆర్టీసీ బస్సు పరకాల నుంచి హనుమకొండకు వెళ్తుంది. ఈ క్రమంలో ఊరుగొండకు చెందిన జన్ను కమలాకర్ తన తమ్ముడితో కలిసి తన ఆటోతో గ్రామానికి సమీపంలో బస్సును అడ్డగించాడు. ఆటోలో వెళుతున్న తమపై నీళ్లు పడ్డాయంటూ దుర్భాషలాడుతూ బస్సు డ్రైవర్ దశరథంపై చేయిచేసుకున్నారు. ఇదే క్రమంలో అతనిపై చెప్పులతో దాడి చేశారు. బస్సు కండక్టర్ మామిడిశెట్టి స్వప్న తన సెల్ ఫోన్‌లో వీడియో తీస్తున్న క్రమంలో ఆమె చేతిని పట్టుకొని గాయపరిచారు. బస్సులోని ప్రయాణికులు అడ్డురాగా వారిపై కూడా దుర్భాషలాడారు. కండక్టర్ మామిడిశెట్టి స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

టీడీపీ పార్లమెంట్ కార్యదర్శిగా నరేష్

ఆత్మకూరు: టీడీపీ వరంగల్ పార్లమెంటు కార్యదర్శిగా మండలంలోని కామారం గ్రామానికి చెందిన కందుకూరి నరేష్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు, కార్యావర్గానికి నరేష్ కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



ఆత్మకూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా ఎదగాలని ఎఫ్ఎంఎం సాంఘిక సేవాసంస్థ కో ఆర్డినేటర్ బత్తుల కరుణ అన్నారు. మండల కేంద్రంలో ఎఫ్ఎంఎం సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ శిక్షణ కేంద్రంను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మహిళలు కుట్టుశిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వయం ఉపాధిని పెంపొందించుకుంటూ కుటుంబానికి అండగా నిలువాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డుసభ్యులు పాపని రవీందర్, రేవూరి ప్రవీణ్‌రెడ్డి, వంగాల భగవాన్‌రెడ్డి, బాషబోయిన పైడి, రూపాదేవి, అజయ్, మా సొసైటీ కార్యదర్శి నాగబండి శివప్రసాద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ధరలు తగ్గించాలి

వరంగల్ చౌరస్తా: పెరిగిన నిత్యావసర వస్తువులు, ముఖ్యంగా కూరగాయల ధరలను తగ్గించకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఇంటికి సాగనంపుతామని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) వరంగల్ జిల్లా కార్యదర్శి నలింగంటి రత్నమాల విమర్శించారు. పెరిగిన కూరగాయల ధరలను తగ్గించాలని వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో ఐద్వా ఆధ్వర్యంలో కూరగాయల దండలను మెడలో వేసుకొని గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నమాల మాట్లాడుతూ పెరిగిన నిత్యావసరాల ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేరళలోని రేషన్ షాపుల్లో ఇచ్చినట్లుగా 14 రకాల నిత్యావసర సరుకులను అన్ని రాష్ట్రాల్లో ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాస్తారోకోలో 5వ జిల్లా కమిటీ సభ్యులు ఎస్.రేణుక, టి.భవాని, ఎం.సునీత, సుభద్ర, రాజేశ్వరి, ప్రీతి, శారద, రాజక్క, రాజకళ పాల్గొన్నారు.

'జంగా' పాదయాత్ర

కాజీపేట: ప్రజల అవసరాలను గాలికి వదిలి స్వప్రయోజనాల కోసమే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఆరాట పడుతున్నారని డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి విమర్శించారు. కాజీపేట పట్టణంలోని 63వ డివిజన్ వివేకానంద కాలనీలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి గురువారం పాదయాత్ర నిర్వహించారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని మహిళలు వేడుకున్నారు.

బోర్డులకే పరిమితమైన హామీలు

- కొప్పులలో కనిపించని ప్రకృతివనం, క్రీడా మైదానం



బోర్డుకే పరిమితమైన క్రీడా మైదానం



ప్రకృతి వనంలో కనిపించని మొక్కలు



ధ్వంసమైన వాకింగ్ ట్రాక్

శాయంపేట : పచ్చని చెట్లను పెంచాలనే లక్ష్యంతో ప్రతీ గ్రామపంచాయతీలో పల్లెప్రకృతివనం ఏర్పాటు చేయాలనే ప్రభుత్వం లక్ష్యం మండలంలోని కొప్పుల గ్రామంలో నెరవేరలేదు. పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామంలో ప్రకృతివనం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే కొప్పుల గ్రామంలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో అధికారులు ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఉన్న ఖాళీ స్థలాన్ని గుర్తించి వనానికి కేటాయించారు. స్థానిక సర్పంచ్ గోలి మాధురి ఆ స్థలంలో రాగడి, ఎర్రమట్టి పోయించి పల్లె ప్రకృతివనం పనులు ప్రారంభించారు. అయితే పాఠశాల ఆవరణలో పల్లె ప్రకతివనం ఏర్పాటు చేయొద్దంటూ గ్రామంలోని కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో పనులు నిలిచిపోయి మూడేళ్లు గడుస్తున్నా కేసు కొలిక్కి రావడం లేదు.

క్రీడా మైదానం ఎక్కడ..!

పట్టణాలతో పాటు పల్లె ప్రజలకు, యువకులకు వ్యాయామం, క్రీడలకు అందుబాటులో ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడా మైదానంను ఏర్పాటు చేయ్యాలనే లక్ష్యం కొప్పుల గ్రామంలో అమలుకు నోచుకోలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు క్రీడప్రాంగణానికి ఎంపిక చేసిన స్థలంలో కంకరపోసి సైడ్ ట్రాక్స్ ఏర్పాటు చేశారు. ఈ ట్రాక్స్‌ను ఆకతాయిలు పడగొట్టడంతో వాటిని పల్లె ప్రకతి వనంలో కుప్పలుగా పోసారు. దీంతో మొక్కలు లేక పల్లె ప్రకతి వనం వెలవెలబోతుండగా క్రీడా ప్రాంగణం బోర్డుకే పరిమితమైంది. దీంతో ప్రభుత్వ హామీలు నెరవేరలేదనే విమర్శలు వస్తున్నాయి.

రైతు వ్యతిరేక కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

శాయంపేట : రైతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని ఎంపీపీ తిరుపతిరెడ్డి అన్నారు. ఉచిత కరెంట్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు గురువారం ధర్నా నిర్వహించి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ రైతుల ఎదుగుదలను చూసి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు. రైతులకు 24గంటల కరెంట్ అవసరం లేదని, 3 గంటల కరెంట్ సరిపోతుందని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరకాల మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మారెపల్లి నందం, సర్పంచ్‌లు చిట్టిరెడ్డి రాజిరెడ్డి, ప్రసాద్, సుమలత, ఉపసర్పంచ్ సుమన్, నాయకులు ఆదిరెడ్డి, రాజేందర్, మోహన్, కృష్ణారెడ్డి, కరణ్‌బాబు, పాపయ్య, కార్తిక్, రాజ్‌మహ్మద్, చిరంజీవి, ప్రభాకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు చివరి గడువు

శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుభాషిణిదేవి గురువారం ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో చేరేందుకు అర్హులైన విద్యార్థులు నేడు (శుక్రవారం) కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా ప్రాంతీయ అధికారికి దరఖాస్తులు సమర్పించాలని ఆమె ప్రకటనలో పేర్కొన్నారు.

బీఆర్ఎస్ నుంచి ఇద్దరి సస్పెన్షన్



మాట్లాడుతున్న చింతం సదానందం

పరకాల: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటంతో పాటు స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై అనవసర ఆరోపణలు చేస్తున్న ఇద్దరు బీఆర్ఎస్ నాయకులను రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు సస్పెండ్ చేస్తున్నట్లు వరంగల్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ చింతం సదానందం గురువారం వెల్లడించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై వ్యక్తిగత విమర్శలకు పాల్పడుతున్న గూడెప్పాడ్ మార్కెట్ వైస్ చైర్మన్ గజ్జి విష్ణుతో పాటు ధర్మారం గ్రామశాఖ నాయకుడు సందెల సునీల్‌ను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్‌చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గూడెప్పాడ్ మార్కెట్ చైర్మన్ రవియాదవ్, దామెర మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గండు రాము, సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, 17వ డివిజన్ కార్పొరేటర్ బాబు, కేయూసీ చైర్మన్ దామోదర్, ఖిల్లా వరంగల్ రైతు సమన్వయ సమితి కన్వీనర్ కడకండ్ల ప్రసాద్, కాట్రాపల్లి సర్పంచ్ సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుర్మికుల డిమాండ్లు నెరవేర్చాలి



కమలాపూర్: సంఘీభావం తెలుపుతున్న బల్మూరి వెంకట్, తదితరులు



పరకాలలో..



దామెరలో..

కమలాపూర్: మరో ఆరు నెలల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని, అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్లను నెరవేరుస్తామని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బల్మూరి వెంకట్ అన్నారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం గత 8 రోజులుగా జీపీ కార్మికులు, ఉద్యోగులు సమ్మె చేస్తుండగా గురువారం ఆయన మండల కేంద్రంలోని సమ్మె శిబిరాన్ని సందర్శించి, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కరోనా విపత్కర సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన పంచాయతీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తుందన్నారు. అధికార పార్టీలో ఉన్న స్థానిక ఎమ్మెల్సీ, కేంద్రంలో అధికార పార్టీలో ఉన్న ఎమ్మెల్యే సైతం పంచాయతీ కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా పంచాయతీ కార్మికుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని, లేదంటే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లి ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. అంతకు ముందుకు మండలంలోని వంగపల్లి, శనిగరం, శ్రీరాములపల్లి, అంబాల, గూడూరు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలకు పరామర్శించి సంతాపం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుండకు చరణ్ పటేల్, నాయకులు ప్రసాద్, భిక్షపతి, ఓదెలు, మనీష్, రాములు, హనుమాన్ ప్రసాద్, రవి, అంజద్, అనిల్, రాజు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పరకాల: గ్రామ పంచాయితీ ఉద్యోగ, కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి డిమాండ్ చేశారు. జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్, కౌన్సిలర్‌లు కొలనుపాక భద్రయ్య, బీజేపీ నాయకులు గాజుల నిరంజన్, బలభద్ర రాజు, మంద రామేశ్వర్, ఆర్‌పీ సంగీత తదితరులు పాల్గొన్నారు.

దామెర: తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని జీపీ కార్మికులు, సిబ్బంది చేపట్టిన సమ్మె గురువారంతో ఎనిమిదో రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా జీపీ కార్మికులు మోకాళ్లపై నిలబడి, కళ్లకు గంతలు కట్టుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు నల్ల చిరంజీవి, ప్రధాన కార్యదర్శి మాదారుపు బొబ్బిలి, ఉపాధ్యక్షుడు గోవిందు ఆనంద్, కోశాధికారి సురేష్, దేవేందర్, కుమారస్వామి, నాగరాజు, రవీందర్, మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు: గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె గురువారంతో 8వ రోజుకు చేరుకుంది. జీపీ ఉద్యోగ, కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జీపీ ఉద్యోగ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొత్తూరి ఏసోబు, గ్రామశాఖ అధ్యక్షుడు కొండేటి రవి, నాయకులు సురేందర్, సంజీవ, రాము, కుమారస్వామి, యాకయ్య, చిరంజీవి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

నడికూడ: గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల సారంగపాణి అన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, గ్రామ పంచాయతీ, ఉద్యోగ కార్మికులు మండల కేంద్రంలో చేపట్టిన నిరవధిక సమ్మె శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. జీపీ కార్మికులకు రూ. 19 వేలు కనీస వేతనం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీపీ మండల జేఏసీ అధ్యక్షుడు పర్వ భాస్కర్, రమేష్, శంకర్, నాగరాజు, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి: జీపీ కార్మికులు సమస్యలు వెంటనే పరిష్కరించి కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారంతో ఎనిమిదో రోజుకు చేరుకోగా ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. జిల్లా సహాయ కార్యదర్శి ఫుల్లా అశోక్, జీపీ కార్మికులు గుడెల్లి లక్ష్మణ్, మండల కన్వీనర్ రమేష్, రవీందర్‌రావు, సామిరెడ్డి, నిమ్మల వెంకటేష్, గొర్రె రమేష్, కుమార్, శ్రీనివాస్, కృష్ణకర్ పాల్గొన్నారు.



ఐనవోలులో..



నడికూడలో..



ఎల్కతుర్తిలో..

కురుమవాడకు సీసీ రోడ్డు నిర్మించాలి



బురదరోడ్డును చూపుతున్న స్థానికులు

ఐనవోలు: మండల కేంద్రంలోని కురుమవాడకు సీసీ రోడ్డు నిర్మించాలని స్థానికులు మజ్జిగ వెంకన్న, ఆరె రమేష్, మజ్జిగ లక్ష్మి, పులి ఉమాశంకర్‌లు కోరారు. ఈ మేరకు గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. వర్షాకాలం సమయంలో వృద్ధులు, చిన్నారులు బురదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామంలో చిన్న కాలనీలకు సైతం సీసీ రోడ్డు వేశారని, కానీ కురుమవాడకు ఇప్పటి వరకు నిర్మించలేదని వాపోయారు. ఐనవోలు, ఒంటిమామిడిపల్లి గ్రామాల మధ్యలో కురుమవాడ ఉండటంతో ఇరు జీపీలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో వచ్చే నాయకులు, ఇప్పుడు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు.

ఉద్యమకారులను అణచివేస్తున్న ఎమ్మెల్యే



మాట్లాడుతున్న తిరుపతి యాదవ్

పరకాల: తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన ఉద్యమకారులను ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అణిచివేస్తున్నారని కేయూ జాక్ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతి యాదవ్ ఆరోపించారు. పట్టణంలోని అమరధామంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దళిత బిడ్డలకు, ఎమ్మెల్యే అనుచరులకు వేర్వేరు న్యాయాలు అన్నట్లు ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారని అన్నారు. ఉద్యమకారుడు గజ్జి విష్ణును బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయడం అన్యాయం అన్నారు. ఉద్యమం సమయంలో లేని ఎమ్మెల్యే లాఠీ దెబ్బలు తిన్న ఉద్యమకారులను విస్మరించడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ నాయకులు గోవింద ప్రణయ్, వడ్డెపల్లి సైలస్, కొమ్ముల అజయ్, దిలీప్, పాణి, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



ఓటు వేస్తున్న విద్యార్థి

శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలోని విద్యార్థులకు గురువారం ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ సుభాషిణి దేవి తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు సమాజం ,ఎన్నికలపై అవగాహన అవసరమని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల తరహాలో విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో విద్యార్థినీలు ఓటు హక్కు వినియోగించుకున్నారని వెల్లడించారు. వైస్ ప్రిన్సిపాల్ వసంత, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ త్రివేణి, ఫరిదా బేగం, మమత, లలిత, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎల్కతుర్తి: కేజీవీల్స్‌తో రోడ్డుపై వెళ్లే ట్రాక్టర్ యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ కోరారు. ఈ మేరకు భీమదేవపల్లి తహసీల్దార్ హరికృష్ణకు గురువారం వినతిపత్రం అందించారు. బీటీ రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్లు నడుపడం వలన రోడ్లు గుంతలమయంగా మారుతున్నాయని, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేజీవీల్స్‌లకు పట్టీలు కట్టుకోకుండా తిరిగే ట్రాక్టర్ యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాకాలంలో రోడ్లు ధ్వంసమవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు తాళ్ళపల్లి అశోక్, బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు తాడూరి చిరంజీవి, నాయకులు బొక్క దావిద్, గంగారపు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



మాట్లాడుతున్న బైరి రవికృష్ణ

పరకాల: బీసీల రాజకీయ సాధికరత సాధించే లక్ష్యంగా రేపు హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన ప్లీనరీని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని అమరధామంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. బీసీలందరూ ప్లీనరీకి తరలివచ్చి ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. అధికశాతం జనాభా కలిగిన బీసీలు రాజకీయంలో వెనుకబాటుకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్యంగా హక్కులు సాధించి రాజకీయంగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకుడు మల్లేష్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లయ్య యాదవ్, ఆనందం, కేయూ జేఏసీ చైర్మన్ తిరుపతి యాదవ్, దేవేందర్, రాజమొగిళి, సారంగపాణి, దేవేందర్, కౌన్సిలర్ పంచగిరి జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న పెండెం రాజు

ధర్మసాగర్(వేలేరు) : తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతన పెంపుదలకు వేతన సవరణ కమిటీని వెంటనే నియమించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యుటీఎఫ్) హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు డిమాండ్ చేశారు. వేలేరు మండలంలోని వివిధ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టి మాట్లాడారు. రెండో పీఆర్సీ అమలు చేయాల్సి ఉన్నందున వెంటనే కమిటీని నియమించాలని కోరారు. హైకోర్టులో ఉన్న స్టేను వెకెట్ చేయించి బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. గురుకుల, కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లా కార్యదర్శి నవీన్ కుమార్, టీఎస్‌యూటీఎఫ్ మండల బాధ్యుడు శ్రీనివాస్, అశోక్, కుటుంబరావు, రాజు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సునీల్

ఆత్మకూరు: రాష్ట్ర సాధనలో ఉద్యమించిన ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సందెల సునీల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 2001 సంవత్సరం నుంచి రాష్ట్రం సాధించే వరకు ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు ఇబ్బందుల్లో ఉన్నారని అన్నారు. ప్రభుత్వం వారికి డబుల్‌బెడ్రూం, దళిత బంధు, బీసీ రుణాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు బాబుమియా, అంకతి రవి, గుర్రం రఘు, రాజయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

16న పేరిణి నృత్య మహోత్సవం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చీఫ్‌విప్, తదితరులు

హన్మకొండ కల్చరల్: పేరిణి నృత్య మహోత్సవంలో నగర ప్రజలు, కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ కోరారు. నాట్య గురువు పద్మశ్రీ నటరాజ రామకృష్ణ శత జయంతి సందర్భంగా ఈనెల 16న ఆదివారం సాయంత్రం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్స్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళా సాంస్కృతిక శాఖ, హనుమకొండ నటరాజ కళాకృష్ణ నృత్య జ్యోతి అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో 'బంగారు తెలంగాణలో పేరిణి నృత్య మహోత్సవం – 2023' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో మహోత్సవ వాల్‌పోస్టర్లను చీఫ్‌విప్ ఆవిష్కరించారు.

కేయూ వీసీకి మాజీ వీసీ అభినందనలు



కేయూ వీసీ రమేష్‌ను అభినందిస్తున్న మాజీ వీసీ ప్రొఫెసర్ ఇక్బాల్‌అలీ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీకి న్యాక్ ఏప్లస్ గ్రేడ్ వచ్చిన నేపథ్యంలో కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్‌ను శాతవాహన యూనివర్సిటీ మాజీ వీసీ, కేయూ ఎకనామిక్స్ రిటైర్డ్ ప్రొఫెసర్ మహ్మద్ ఇక్బాల్‌అలీ గురువారం కలిసి అభినందించారు. అలాగే, వీసీ రమేష్‌కు కేయూ ఆల్‌మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఎంఎస్‌ఏ) ఆధ్వర్యంలో బుద్ధుడి ప్రతిమ అందజేశారు. ఏఎంఎస్‌ఏ కేయూ అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య, ప్రొఫెసర్ వరలక్ష్మి, డాక్టర్ తిరుమలాదేవి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9505507575
9010299096 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
వి.రాజ్‌కుమార్ (S.R) : 9966290903 (ఎల్కతుర్తి)
పి.చంద్రశేఖర్ (A.C.O) : 8074606274